కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

కనీస వేతనం లేని కాంట్రాక్టు ఉద్యోగులు

- వెట్టి చాకిరి నుండి విముక్తి ఎప్పుడు..?
- సమ్మెలో మున్సిపల్ ఇంజనీరింగు కాంట్రాక్టు ఉద్యోగులు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఇంజనీరింగు కాంట్రాక్టు ఉద్యోగులు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం చేస్తున్న సమ్మె ఆరో రోజుకు చేరింది. సుప్రీంకోర్టు ఆదేశానుసారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలనే ఆదేశాలను బేఖాతరు చేసి వెట్టిచాకిరి చేయించుకుంటున్నారని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈనేపథ్యంలో ప్రజాశక్తి ప్రత్యేక కథనం....

కర్నూలు నగరంలో సుమారు పదిలక్షల జనాభాకు ప్రతినిత్యం 24 గంటలు తాగునీరు సరఫరా చేస్తూ, విద్యుత్ దీపాలు వెలిగిస్తూ, నగరాన్ని పచ్చదనం పంచుతూ, కరోనా సమయాల్లో, అత్యవసర సమయాల్లో ప్రజల అవసరాలు తీర్చే వారికి కేవలం రూ.13087 ఇస్తూ పిఎఫ్, ఇఎస్ఐ మాత్రం కట్ చేస్తూ, వెట్టిచాకిరి చేయించుకుంటున్నారు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా పనిచేస్తూ ఉన్నప్పటికీ ప్రభుత్వ ఉద్యోగులని చెప్పి ప్రభుత్వం ఇచ్చే సంక్షేమ పథకాలు ఇవ్వకుండా ఆపేశారు. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం అమలు చేయాలి లేదా సంక్షేమ పథకాలైనా వర్తింపచేయాలని ఉద్యోగులు కోరుతున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలలో భాగంగా పెన్షన్లు, విద్యార్థులకు ఫీజు రియంబర్స్‌మెంట్, విద్యాదేవన, అమ్మఒడి, తల్లికి వందనం లాంటి పథకాలు కూడా అందించడం లేదు. గ్రాడ్యుటీ, కరువు భత్యం లేదు. ఎలాంటి అదనపు సౌకర్యాలు లేకుండా తక్కువ వేతనంతో ఎలా జీవించాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగులుగా పదవి విరమణ చేసిన వారి స్థానంలో కాంట్రాక్టు ఉద్యోగులతో పని చేయించుకోవడంతో పని భారం పెరిగి మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. ఇటు ప్రజలకు, అటు ప్రభుత్వ అధికారులకు సేవలు చేస్తున్న వారికి ఎలాంటి ఎదుగుదల లేకుండా చేయడం దారుణం. విధి లేని పరిస్థితుల్లో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈనెల 7 నుండి పనులకు ఆటంకం లేకుండా సమ్మె చేస్తున్నారు. వారి బాధలు అర్థం చేసుకొని ప్రభుత్వం సానుకూలంగా స్పందించి చర్చలకు నాయకులను పిలిచి వారి డిమాండ్లను నెరవేర్చాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రభుత్వం మొండి వైఖరి వహిస్తే విధులను బహిష్కరించి పూర్తిస్థాయి సమ్మెలోకి వెళ్లాల్సి వస్తుందని హెచ్చరించారు.

సమ్మె చేపడుతున్న కార్మికులు

ప్రధాన డిమాండ్లు: టెక్నికల్ నాన్ టెక్నికల్ కార్మికులకు వేతనం రూ.29200, రూ.24,500 ఇవ్వాలి. 15 యేళ్ల పైబడిన సర్వీస్ గల కార్మికులందరినీ క్రమబద్ధీకరించాలి. 55 ఆదివారాలు 17 దేశ జాతీయ రాష్ట్ర పండుగల 72 రోజులు సెలవులుగానైనా ప్రకటించాలి. విధి నిర్వహణలో చనిపోయిన కార్మికుని కుటుంబానికి రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా, అంగవైకల్యం పొందిన వారికి రూ.ఐదు లక్షలు ఇస్తూ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలి. సీనియార్టీ ప్రాతిపదికన జీతాలు పెంచి చెల్లించాలి. హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలి. సంక్షేమ పథకాలు అమలు చేయాలి. పదవి విరమణ తర్వాత ఇతర ఉద్యోగుల లాగా గ్రాడ్యుటీతోపాటు పదివేలు కనీస పెన్షన్ ఇవ్వాలి.

వెట్టి చాకిరి నుండి విముక్తి చేయాలి

గత 30 యేళ్లుగా వెట్టిచాకిరి చేస్తున్న కార్మికులకు విముక్తి కలిగించేలా పర్మనెంట్ చేయాలి. నగర అభివృద్ధి జరుగుతున్నా మా జీవితాల్లో అభివృద్ధి లేదు. కనీసం విద్యార్థులకు చదివించుకోవడానికి కూడా స్తోమత లేకుండా ఉంది. జీతాలన్న పెంచండి. సంక్షేమ పథకాలు అయినా వర్తింప చేయండి.

- జి.వెంకటేశ్వర్లు, ఎపి మున్సిపల్ ఇంజనీరింగ్ వర్క్ యూనియన్ నగర అధ్యక్షులు.

జీవితంతో పోరాడుతున్న

ఈ ఉద్యోగంలో చేరి బయటికి పోలేక జీవితంతో పోరాడుతున్న. పిల్లలకు చదివించుకో లేకున్నాం. తక్కువ జీతంతో ఇంటికి వెళితే భార్యలు చీదరించుకుంటున్నారు. నెలలో మూడు షిఫ్టులలో పనిచేస్తున్నాం. సమయం ఉన్నప్పుడు మార్కెట్ యార్డులో మూటలు మోయడం చేసి రోజుకు రూ.500 సంపాదిస్తున్న. నెలలో ఒక వారం పని ఉంటుంది. ఇద్దరు పిల్లలు ప్రైవేట్ కళాశాలలో చదువుతున్నారు. ప్రతి నెల రూ.20 వేల దాకా అవుతుంది. జీతం చాలక అధిక వడ్డీలకు అప్పులు చేసి నానా కష్టాలు పడుతున్నం.

- ఎస్ మనోహర్ (మధు) జిల్లా అధ్యక్షులు. ఫిల్టర్ బెడ్ ఆపరేటర్.

భార్యాభర్తలం కష్టపడుతున్నం

పిల్లల ఫీజులు, ఇంటి బాడుగ, ఇంటి సరుకులు, డిష్ ,పాల బిల్లు, కూరగాయలు అన్నీ కలిసి రూ.20వేల దాకా అవుతుంది. మా ఉద్యోగానికి కిరాణం యజమానులు అప్పులు ఇవ్వడానికి కూడా జంకుతున్నారు. విధి లేని పరిస్థితిలో రూ.నూటికి మూడు చొప్పున వడ్డీకి అప్పులు చేసి అవి తీర్చడానికి రాత్రింబగళ్లు కష్టపడుతున్నాం. డ్యూటీ లేని సమయంలో అధికారులు పని ఉంది అని పిలిస్తే వెళ్లి పని చేయాల్సి వస్తుంది. మీరు చేయకపోతే వేరే వాళ్ళతో పని చేయించుకుంటాం అని అధికారులు బెదిరింపులకు పాల్పడుతున్నారు.

- సి నాగశేషులు. పంప్ హౌస్ ఆపరేటర్.

ప్రమాదకర పరిశ్రమలొద్దు

- 14న ప్రజాభిప్రాయ సేకరణ రద్దు చేయాలి
- ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూలు మండలంలోని గొందిపర్ల సమీపంలో టిజివి గ్రూపు పరిశ్రమల విస్తరణకు వ్యతిరేకంగా ప్రజా సంఘాలు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టాయి. ఈ నెల 14న నిర్వహించ తలపెట్టిన ప్రజాభిప్రాయ సేకరణను రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. రసాయనాలు విడుదల చేసే పరిశ్రమలకు అనుమతి ఇవ్వరాదని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. టిజివి ఎస్ఆర్ఎసిఎల్ పరిశ్రమ విస్తరణ కోసం కాలుష్య నియంత్రణ మండలి తలపెట్టిన ప్రజాభిప్రాయ సేకరణను రద్దు చేయాలని, పర్యావరణ ప్రభావ అంచనా నివేదికను సవరించిన తర్వాతే ప్రజాభిప్రాయ సేకరణ జరపాలని ధర్నాలో పాల్గొన్న నాయకులు డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్ రాధాకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ ధర్నాలో హెచ్‌ఆర్‌ఎఫ్ రాష్ట్ర నాయకులు శ్రీనివాసులు, హెచ్‌ఆర్‌ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు , ఆర్‌వివి నాయకులు విజయ భాస్కర్ రెడ్డి, రాయలసీమ సాగునీటి సాధన సమితి నాయకులు రామకృష్ణా రెడ్డి, డిటిఎఫ్ నాయకులు రత్నం యేసేపు, ఆర్‌సిఎస్ నాయకులు సుంకన్న, ఎస్‌యుసిఐ నాయకులు నాగన్న, ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి. రామకృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నారాయణ, కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆనంద్‌బాబు, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్, సిఐటియు నాయకులు నరసింహులు రఫీ, చిన్న వ్యాపారుల సంఘం రఫీ, పిఒపి నాయకులు శ్రీనివాస రావు, బిఎన్‌కెఎస్ నాయకులు ఇమ్మాన్యుల్, జెవివి నాయకులు పాణి గ్రాహి, ఎస్‌డిపిఐ నాయకులు జహంగీర్ అహ్మద్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అబ్దుల్లా, రంగప్ప, సిపిఐ జిల్లా నాయకులు రామకృష్ణా రెడ్డి, ఐద్వా నాయకులు అలివేలు, డివైఎఫ్ఐ నాయకులు రాఘవేంద్ర, ఉశేన్ వలి తదితరులు పాల్గొన్నారు. నాయకులు మాట్లాడుతూ పరిశ్రమ యాజమాన్యం సమర్పించిన పర్యావరణ ప్రభావ అంచనా నివేదికలో అనేక లోపాలు ఉన్నాయని తెలిపారు. ప్రజలకు అవగాహన కల్పించే ముఖ్య సమాచారం అందులో లేదని పేర్కొన్నారు. సంస్థ తయారుచేసే పాలిటెట్రాఫ్లోరోఇథలిన్ (పీటీఎఫ్ఈ) రసాయన ప్రక్రియలో పెర్ఫ్లోరోక్టానాయిక్ (పీఎఫ్ఏఎస్), కార్బన్ టెట్రాక్లోరైడ్ (సీసీఎల్4) వంటి ప్రమాదకరమైన రసాయనాలు వెలువడతాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ రసాయనాల నిల్వ , వినియోగం వల్ల కలిగే నష్టాల గురించి నివేదికలో ఎటువంటి సమాచారం లేదని వారు విమర్శించారు. ఇటీవల అనకాపల్లి జిల్లా అచ్యుతాపురంలో జరిగిన ప్రమాదంలో 17 మంది కార్మికులు మరణించారని గుర్తు చేశారు. ఈ పరిశ్రమల తయారీలో ఉపయోగించే సర్ఫెక్టెంట్ల వల్ల క్యాన్సర్లు వచ్చే అవకాశం ఉందని తెలుస్తోందన్నారు. ఈ పరిశ్రమ విస్తరణ వల్ల కర్నూలు నగరానికి సమీపంలో ప్రవహిస్తున్న కృష్ణ , తుంగభద్ర నదుల నీటి వనరులపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఐఐటీ మద్రాస్ పరిశోధనలో పిఎఫ్ఎఎస్ రసాయనం ప్రమాదాలు వెల్లడైన తర్వాత కూడా ఈ పరిశ్రమకు అనుమతిస్తే, కృష్ణా నది నీరు తాగడానికి పనికిరాకుండా పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ పరిశ్రమ తెలంగాణ సరిహద్దులో ఉన్నందున, దీని ప్రభావం అక్కడి ప్రజలపై కూడా ఉంటుందని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణ చట్టం ప్రకారం, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి తెలంగాణ ప్రజల అభిప్రాయాలను కూడా సేకరించాలని, లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని వారు హెచ్చరించారు.

ప్రాథమిక పాఠశాల విద్యా వ్యవస్థ నిర్వీర్యం

- బదిలీలు పదోన్నతులపై స్పష్టత కరువు
- రాష్ట్ర సహాధ్యక్షుడు కె.సురేష్ కుమార్
- డిఇఒ ఆఫీసు ఎదుట యుటిఎఫ్ ధర్నా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ప్రాథమిక పాఠశాల విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసే విధంగా పాఠశాల విద్యాశాఖ తీసుకుంటున్న చర్యలు ఉన్నాయని యుటిఎఫ్ రాష్ట్ర సహా అధ్యక్షుడు కె.సురేష్‌కుమార్ అన్నారు. ఉపాధ్యాయుల బదిలీలు పదోన్నతులపై స్పష్టత లేకుండా ఉందన్నారు. అందుకే త్వరలో ఉపాధ్యాయ సంఘాల కలుపుకొని ఉద్యమం చేపడతామని పేర్కొన్నారు. సోమవారం యుటిఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో డిఇఒ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. జిల్లా అధ్యక్షుడు యుఆర్ఎ రవికుమార్ అధ్యక్షతన జరిగిన ధర్నాలో రాష్ట్ర సహాధ్యక్షుడు కె.సురేష్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.నవీన్ పాటి మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలనే అమలు చేస్తుందన్నారు. జీవో నెంబర్ 117 ను రద్దు చేస్తామని హామీ ఇచ్చి ఇప్పటివరకు రద్దు చేయలేదని అన్నారు. రాష్ట్రంలో తొమ్మిది రకాల పాఠశాలలను తీసుకొస్తున్నారన్నారు. నూతన విద్యా విధానం అమలు పేరుతో అనేక చర్యలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. ఈ చర్యల వల్ల పాఠశాలలు లేకుండా చేయడమే లక్ష్యమన్నారు. ప్రపంచ బ్యాంకు ఒప్పందంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యా వ్యవస్థను పూర్తిగా నాశనం చేసే విధంగా వివరిస్తుందన్నారు. ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించి రోజుకొక ఉత్తర్వులను విడుదల చేస్తూ గందరగోళానికి గురి చేస్తున్నారన్నారు. ఇప్పుడు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల వల్ల పాఠశాలల్లో ఉపాధ్యాయుల సంఖ్యను కుదిస్తుందన్నారు. ఉపాధ్యాయుల బదిలీలు పదోన్నతులపై ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈనెల 15న విజయవాడలో జరిగే ధర్నాలో కూడా పెద్ద ఎత్తున ఉపాధ్యాయులు పాల్గొనాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకునేందుకు ఉపాధ్యాయులు అందరూ సంసిద్ధం కావాలన్నారు. ఈ కార్యక్రమం అనంతరం డిఇఒ శామ్యూల్ పాల్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షుడు హేమంత్‌కుమార్, జిల్లా ఆర్థిక కార్యదర్శి యెహోషువ, జిల్లా కార్యదర్శులు తిమ్మన్న, బాబు, చంద్రకళ, దుర్గాప్రసాద్, కౌలన్న, భాస్కర్ ఆడిట్ కన్వీనర్ శ్రీనివాసులు, రాష్ట్ర కౌన్సిలర్ ఎల్లప్ప, జిల్లా సీనియర్ నాయకులు జయరాజు, హనుమంతు వివిధ మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు



డిఇఒకు వినతిపత్రం అందజేస్తున్న యుటిఎఫ్ నేతలు

పెండింగు దరఖాస్తులు పరిష్కరించాలి

- ఇంచార్జి కలెక్టర్ డాక్టర్ బి.నవ్య

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ప్రజా సమస్యలు పరిష్కార వేదికలో వచ్చిన దరఖాస్తులు పెండింగులో ఉన్న వాటిని పరిష్కరించాలని ఇన్‌చార్జి కలెక్టర్ డాక్టర్ బి.నవ్య అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమంలో భాగంగా ఇన్‌చార్జి కలెక్టర్ ప్రజల నుండి వినతులను స్వీకరించారు. ఫిర్యాదుల స్వీకరణ అనంతరం ఇంచార్జి కలెక్టర్ ఫిర్యాదుల పరిష్కారంపై అధికారులతో సమీక్షించారు.

అర్హులైన కౌలు రైతులను గుర్తించండి

గ్రామ సభల ద్వారా అర్హులైన కౌలు రైతులను గుర్తించే విధంగా చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జి కలెక్టర్ తహశీల్దార్లను ఆదేశించారు. తద్వారా గుర్తించిన కౌలు రైతులకు సిసిఆర్‌సి కార్డులు ఇప్పించే విధంగా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. 25 వేల సిసిఆర్‌సి కార్డుల జారీ చేయాలని జిల్లాకు లక్ష్యంగా నిర్ణయించామన్నారు. ముందుగానే అర్హులైన కౌలు రైతులను గుర్తించి వారికి సిసిఆర్‌సి కార్డులు ఇప్పించిన ఎడల వారు ప్రైవేట్ వ్యక్తుల వద్ద డబ్బులు తీసుకోకుండా బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించే విధంగా తగిన చర్యలు తీసుకోవచ్చునన్నారు. సమావేశంలో డిఆర్ఒ సి.వెంకట నారాయణమ్మ, హౌసింగ్ పిడి చిరంజీవి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి కలెక్టర్

నేటి నుండి జాతీయస్థాయి బండలాగుడు పోటీలు

ప్రజాశక్తి - కర్నూల్ కలెక్టరేట్ : నన్నూరు గ్రామంలో ఎబిఎం చర్చి ప్రతిష్ట ప్రతిష్టలో భాగంగా మంగళవారం నుండి జాతీయస్థాయి బండలాగుడు ఎద్దుల పోటీలను మంగళవారం నుండి ప్రారంభమవుతాయని నిర్వాహకులు ఎస్.నాగరాజు, కె. రామకృష్ణ, పి.ఇమ్మానియేల్, ఎస్.సురేష్, జె. నాగరాజు, సునీల్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నన్నూరు గ్రామంలో ఉదయం 7 గంటలకు ఈ బండలాగుడు పోటీలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ఈ పోటీలకు మొదటి బహుమతిని మాజీ సర్పంచ్ శ్రీరెడ్డి చెన్నారెడ్డి రూ.60వేలు, రెండో బహుమతిని గౌండ పెద్ద రాముడు రూ 40 వేలు, మూడో బహుమతిని గ్రామ సర్పంచి బ్రహ్మయ్య ,బోరెల్లి శ్రీనివాసులు రూ 30వేలు, నాలుగో బహుమతి సన్యాసి అన్నయ్యలు రూ.25వేలు అందజేస్తున్నారని పేర్కొన్నారు. పోటీలో పాల్గొనే ప్రతి జట్టుకు కన్సోలేషన్ బహుమతులు ఇస్తామన్నారు. మాజీ సర్పంచి శ్రీరెడ్డి చెన్నారెడ్డి ఆధ్వర్యంలో భోజన వసతి సౌకర్యం కల్పిస్తున్నారన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్ : జిల్లాలో సోమవారం నుండి ప్రారంభమైన ఇంటర్మీడియట్ సప్లమెంటరీ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో కొనసాగాయి. ఉదయం జరిగిన మొదటి సంవత్సరం పరీక్షకు 3660 మంది విద్యార్థులు హాజరుకాగా182 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన ద్వితీయ సంవత్సర పరీక్షకు 601 మంది విద్యార్థులు హాజరు కాగా 59 మంది గైర్హాజరయ్యారు. జిల్లాలో ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పరీక్షలు నిర్వహించినట్లు ఆర్ఐఒ ఎస్‌విఎస్ గురువయ్య శెట్టి వెల్లడించారు.

టెన్త్ సప్లమెంటరీ హాల్ టికెట్లు విడుదల

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ : ఈనెల 28 నుండి ప్రారంభమయ్యే టెన్త్ సప్లమెంటరీ పరీక్షల హాల్ టికెట్లు విడుదల చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.శామ్యూల్ పాల్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పరీక్ష రాసే విద్యార్థులు నేరుగా వాట్సాప్‌లో మనమిత్ర యాప్ ద్వారా హాల్‌టికెట్లు పొందవచ్చని పేర్కొన్నారు. సంబంధిత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుల ద్వారా నేరుగా హాల్ టికెట్లు పొందాలని పేర్కొన్నారు.

డిఎస్‌సి అభ్యర్థుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ : డిఎస్‌సి అభ్యర్థులు ఎదుర్కొంటున్న తీవ్రమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాఘవేంద్ర, నగేష్ జిల్లా సహాయ కార్యదర్శి హుస్సేన్‌బాషలు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా ఇన్చార్జి కలెక్టర్ బి.నవ్యకు వినతిపత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ ఏడేళ్లనుంచి డిఎస్‌సి నోటిఫికేషన్ లేకపోవడం నిరుద్యోగులు మీద పడి డిఎస్‌సికి అనర్హులుగా అవుతున్నారన్నారు.. వెంటనే 47 సంవత్సరాలకు వయసు పెంచాలన్నారు. అభ్యర్థులందరూ ఒకే క్వశ్చన్ పేపర్‌తో పరీక్ష రాసే లాగా చర్యలు తీసుకోవాలన్నారు. పర్సంటేజ్ నిబంధనను తొలగించాలన్నారు. యుబిపిడి అభ్యర్థులు కోరుతున్నట్టు పిఇటి పోస్టులకు ఫిజికల్ ఈవెంట్స్ నిర్వహించి అప్పర్ ప్రైమరీ స్కూళ్లలో కూడా పిఇటిని ఏర్పాటు చేయాలన్నారు. ఫిజికల్ హ్యాండ్ క్యాప్డ్ అభ్యర్థులకు 6000 పోస్టులు ఉన్నప్పుడే కర్నూలు జిల్లాలో మూడు పోస్టులు పోస్టులు పెరిగాక అవి ఇప్పుడు జీరో అయ్యాయ న్నారు. బిఎస్‌సి కంప్యూటర్ చదివినవారికి డిఎస్‌సిలో ఫిజికల్ సైన్స్ రాసుకునే అవకాశాన్ని కల్పించాలని కోరారు.

వినతి ఇస్తున్న నాయకులు

స్మార్ట్ మీటర్లను ఆపే వరకు పోరాటం : సిపిఎం

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

రాష్ట్ర వ్యాప్తంగా ఆదానితో కుదుర్చుకున్న ఒప్పందాలను రద్దుచేసి స్మార్ట్ మీటర్ల బిగింపును ఆపే వరకు పోరాటం ఆగదని సిపిఎం నాయకులు తెలిపారు. సోమవారం 32వ వార్డు సుందరయ్య నగర్, గంగావతి నగర్ లలో స్మార్ట్ మీటర్ల బిగింపును ఆపాలని, ట్రుఆప్ చార్జీలు రద్దు చేయాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో స్టిక్కర్లను ఇంటింటికి తిరిగి అతికించారు. సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు కె సుదాకరప్ప, ఏరియా కార్యదర్శి ఇ రామాంజనేయులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు స్మార్ట్ మీటర్లను బిగిస్తే పగలకొట్టమని ఇప్పటి ముఖ్యమంత్రి నారా లోకేష్ ప్రజలకు పిలుపునిచ్చిన సంగతిని వారు గుర్తు చేశారు. మాకు ఈ స్మార్ట్ మీటర్ వద్దని ప్రజలు వ్యతిరేకించాలని కోరారు. సిపిఎం నాయకులు కె సురేష్, ఎం.దావీద్, భీసన్న, బి.నాగప్ప, లక్ష్మీదేవి, బి.శిరోమణి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు కార్పొరేషన్ : స్మార్ట్ మీటర్ల పేరుతో కార్మికులను తొలగించడం సరికాదని సిపిఎం కార్యదర్శి వర్గ సభ్యులు అబ్దుల్ దేశాయ్ అన్నారు. సోమవారం ఆరవ వార్డు గడ్డ ఏరియాలో మా ఇంటికి స్మార్ట్ మీటర్ వద్దు కరెంట్ చార్జీలు తగ్గించాలని ఇంటింటి తిరిగి స్టిక్కర్లు అంటించారు. సచివాలయం ముందు నిరసన తెలిపారు. సిపిఎం పార్టీ శాఖ కార్యదర్శి షేక్ అహ్మద్, చాంద్ బాషా, సెక్రటేరియట్ సభ్యులు అబ్దుల్ దేశాయ్‌లు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మహమ్మద్ సమీర్ మూస తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు హాస్పిటల్: కల్లూరు అర్బన్ పరిధిలో 30వ వార్డులో స్మార్ట్ మీటర్ స్టిక్కర్లు విడుదల చేశారు. ఇంటింటికి అతికించారు. సిపిఎం నగర నాయకులు జి ఏసురాజ్ మాట్లాడారు. వార్డు సభ్యులు పి మధు జి మౌలాబీ, ఎన్ ప్రభాకర్, రవి, గోవిందరాజులు, తిమోతి, బాష, ఎన్. దేవదాస్, పి హుస్సేన్, సి గోపాల్, ఎన్ ప్రభాకర్లు మాట్లాడుతూ ఇంటి యజమానులు స్వయానంగా మేము మా ఇంటికి అతికించుకుంటామని తెలిపారన్నారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్లు వద్దంటూ స్టిక్కర్లను చూపుతున్న నాయకులు, ప్రజలు

జిజిహెచ్‌లో నర్సుల దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ధన్వంతరి హాలులో అంతర్జాతీయ నర్సుల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె వెంకటేశ్వర్లు ఫ్లోరెన్స్ నైటింగేల్ విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. డాక్టర్ కె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కర్నూలు అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని పురస్కరించుకొని వారికి శుభాకాంక్షలు తెలిపారు. వైద్యరంగంలో కీలకమైన నర్సు వృత్తికి గౌరవాన్ని, హుందాతనాన్ని తీసుకొచ్చిన ఫ్లోరెన్స్ నైటింగేల్ పుట్టినరోజు సందర్భంగా అంతర్జాతీయ నర్సుల దినోత్సవంగా జరుపుకుంటారని తెలిపారు. అన్నారు. ఆసుపత్రిలో డాక్టర్స్‌తోపాటు నర్సులు అందిస్తున్న సేవలు వెలకట్టలేనివనీ అన్నారు. కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి మాట్లాడుతూ ఆసుపత్రిలో సేవ చేస్తున్న నర్సులు నిజంగానే సేవామూర్తులన్నారు. ఆసుపత్రిలో పేషెంట్లు చేరిన నాటి నుంచి కోలుకొని తిరిగి వెళ్ళేవరకు వెన్నంటే ఉండి వారు సేవలు చేస్తార అన్నారు. అనుక్షణం నర్స్, సిస్టర్ అంటూ పిలిచినా విసుగు చెందకుండా వస్తారని అన్నారు. డాక్టర్లకు, ఇటు రోగులకు అనునిత్యం అందుబాటులో ఉంటూ స్వీయ రక్షణతోపాటు బాధితులను కూడా రక్షించేందుకు పాటుపడుతున్నారన్నారు. ఇంతటి సేవ చేస్తూ ఉద్యోగంలో ఎదురయ్యే ఒత్తిళ్లను ఎదుర్కొంటూ.. వ్యక్తిగత జీవితానికి, కుటుంబానికి దూరంగా ఉంటూ ఈ కష్ట కాలంలో సేవలు అందిస్తున్న ప్రతి ఒక్క నర్సుకు మనస్ఫూర్తిగా ధన్యవాదలు తెలిపారు. ఈ కార్యక్రమంలొ డిప్యూటీ సూపరింటెండెంట్, డాక్టర్ శ్రీరాములు, నర్సింగ్ సూపరింటెండెంట్, సావిత్రి బాయి, నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్ 2 విమలమ్మ, ఎపిఎన్‌జిఒ ప్రెసిడెంట్, సిహెచ్. వెంగల్‌రెడ్డి, నర్సింగ్ సిబ్బంది తదితరులు, పాల్గొన్నారు.

నర్సుల దినోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే తదితరులు

మెడికల్ కాలేజీ క్యాంటీన్‌కు తాళం

ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్

ప్రజాశక్తి- కర్నూలు హాస్పిటల్

లీజు గడువు ముగిసినా ఖాళీ చేయకపోవడంతో కర్నూలు మెడికల్ కాలేజీ క్యాంటీన్‌కు సోమవారం ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ బ్రహ్మాజీ మాస్టర్, ట్రెజరర్ దామం శ్రీనివాసులు ఆధ్వర్యంలో తాళం వేసి క్యాంటీన్‌ను మూసివేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నడుస్తున్న క్యాంటీన్‌ను ఐదేళ్ల కాల పరిమితితో డాక్టర్ వరప్రసాద్‌కు 2013లో లీజ్‌కు ఇచ్చారని తెలిపారు. ఆయన నేటికి ఖాళీ చేయకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. ఫోర్జరీతో 30 సంవత్సరాల వరకు అనుమతి ఉందంటూ ఖాళీ చేయడం లేదని తెలిపారు. గతంలో ఎపిజిడిఎగా నోటీసు ఇచ్చినా ఆయన నుంచి స్పందన రావడం లేదని, అందుకే ఈరోజు క్యాంటీన్‌కు తాళం వేసి మూసివేస్తున్నామని తెలిపారు. ఈ విషయాన్ని ప్రిన్సిపల్, పోలీసులకు స్టాఫ్‌కు తెలియపరిచామని అన్నారు. క్యాంటీన్ నిర్వహణకు సంబంధించి జనరల్ బాడీ సమావేశం ఏర్పాటు చేసుకొని అందులో నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ నాయకులు డాక్టర్ వైకెసి రంగయ్య, డాక్టర్ మురళి ప్రభాకర్, డాక్టర్ రామకృష్ణ నాయక్, డాక్టర్ రామశివ నాయక్, డాక్టర్ వై.రమణ, డాక్టర్ నాగేశ్వరరావు, డాక్టర్ సురేష్, డాక్టర్ సోమశేఖర్, డాక్టర్ బాల సారయ్య, పిజి వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

సాయంత్రానికి తెరుచుకున్న క్యాంటీన్

కర్నూలు మెడికల్ కళాశాల క్యాంటీన్ కు ఆంధ్ర ప్రదేశ్ గవర్నమెంట్ డాక్టర్ అసోసియేషన్ ప్రతినిధి బృందం ఉదయం మూసేసి తాళాలు వేశారు. కానీ లీజ్ దారుడు డాక్టర్ వరప్రసాద్ సోమవారం సాయంత్రం క్యాంటీన్ వద్దకు వచ్చి తాళాలు తీసి క్యాంటీన్‌లో క్రయ విక్రయాలను నిర్వహించారు.

విఆర్ఎల సమస్యలు పరిష్కరించాలి : సిఐటియు

ప్రజాశక్తి - కోడుమూరు రూరల్

విఆర్ఎల సమస్యలు పరిష్కారం కోరుతూ ఈనెల 20న దేశవ్యాప్త సమ్మె చేస్తున్నామని సిఐటియు కోడుమూరు మండల కార్యదర్శి జిపి వీరన్న తెలిపారు. మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా పోరాటం చేసి సాధించుకున్న 44 రకాల కార్మిక చట్టాలను రద్దు చేస్తూ నాలుగు రకాల లేబర్ కోడు లా ను తీసుకొచ్చి కార్మికులకు అనేక రకాలుగా ఇబ్బందికి గురిచేస్తున్నారన్నారు. కార్మికులు వారి హక్కులను కాపాడుకొనుటకు ఈనెల 20న జరగబోయే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. విఆర్ఏలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని టైం స్కేల్ జీతాలు చెల్లించాలని, డిఎను జీతాలలో కలపాలి నైట్ డ్యూటీ అక్రమ డ్యూటీలు రద్దు చేయాలి రీ సర్వే, టిఎ, డిఎ లు చెల్లించాలి వీఆర్వో అటెండర్ రికార్డ్ అసిస్టెంట్ డ్రైవరు కంప్యూటర్ ఆపరేటర్ ఖాళీ పోస్టులో భర్తీలో అర్హులైన విఆర్ఎలను నియమించాలి నామినీలను విఆర్ఎలుగా గుర్తించాలని, ప్రమాదంలో మరణించిన విఆర్ఏలకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కోరారు. సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని కోడుమూరు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తహశీల్దార్ వెంకటేష్ నాయక్‌కు ఇచ్చారు. సిఐటియు నాయకులు బి కుమార్, విఆర్ఎల నాయకులు యుగంధర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తక పఠనం అలవాటు చేయాలి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

విద్యార్థులకు పుస్తక పఠనం అలవాటు చేయాలని జిల్లా కేంద్ర గ్రంథాలయం ఉపగ్రంథ పాలకురాలు వి.పెద్దక్క అన్నారు. సోమవారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి పునర్చరణ తరగతులలో భాగంగా ఉదయం 8గంటలనుండి11గంటలవరకు వచ్చిన 69 మంది విద్యార్థులతో కథల పుస్తకాలు చదివించారు. తదుపరి గోపాలకృష్ణ రిటైర్డ్ ఎంప్లాయి విద్యార్థులకు సులభశైలిలో గణితం బోధించారు. ఎం. నాగరాజు జనరల్ నాలెడ్జ్ ప్రశ్నలు అడుగుతూ జవాబులు రాబట్టారు. ఎస్.రవి కిరన్‌రెడ్డి విద్యార్థులకు స్కూలులో క్రమశిక్షణతో ఉంటూ పాఠాలు వినడం వాటిని ఒక పద్ధతిలో వినడం చదవడం గుర్తుంచుకునే విధానం, ఉపాయాలు, పద్ధతులు, కాశీ మజిలీ లోని కథల ద్వారా సులభ శైలిలో అర్థం వచ్చేలా నేర్పించారు. కె హను మంతప్ప రిటైర్డ్ లెక్షరర్ ఇంగ్లీషులో గ్రామర్ బోదించారు. ఎ.హను మంతప్ప రిటైర్డ లెక్షరర్ చేతులమీదుగా విద్యార్థులకు బిస్కెట్స్ పంచారు .ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ లైబ్రేరియన్ వి.గోవిందరెడ్డి, లైబ్రేరియన్ బాష. సిబ్బంది , విద్యార్థులు పాల్గొన్నారు.

గడువులోగా సమస్యలను పరిష్కరించాలి

- ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 10 అర్జీలు : కమిషనర్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా వచ్చిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి, అర్జీదారుల్లో సంతృప్తి స్థాయి పెంచే విధంగా నిర్దేశిత గడువులోగా వాటికి శాశ్వత పరిష్కారం చూపాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎస్.రవీంద్రబాబు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి 10 ఫిర్యాదులు వచ్చాయి. ఒక్కో అర్జీదారుడి నుండి సమస్యను అడిగి తెలుసుకుంటూ, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కమిషనర్ సంబంధింత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్‌జివి కృష్ణ, మేనేజర్ చిన్నరాముడు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర్ రెడ్డి, సిటి ప్లానర్ ప్రదీప్ కుమార్, ఇంచార్జ్ ఎస్ఇ శేషసాయి, టిపిఆర్ఒ వెంకటలక్ష్మి, పారిశుధ్య పర్యవేక్షక అధికారి నాగరాజు, టిడ్కో అధికారి పెంచలయ్య, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి రాకుండా జాగ్రత్తలు

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని పట్టణ ప్రజలకు తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మున్సిపల్ ఇంచార్జి చైర్మన్ మొహమ్మద్ గౌస్ తెలిపారు. సోమవారం వాటర్ పంప్ హౌస్ వద్ద నీటి సరఫరాపై డిప్యూటీ ఇంజనీర్ రామమూర్తి, ఎఇ జనార్ధన్‌తో చర్చించారు. ఆయన మాట్లాడుతూ ఆదోని మునిసిపాలిటీ నీటి సరఫరాలో పారదర్శకత, సమర్ధత కోసం నిరంతరంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఆదోని పట్టణ ప్రజలకు తాగునీటి విషయంలో ఎటువంటి ఇబ్బంది కలగకుండా చేపట్టిన చర్యలు గురించి తెలుసుకున్నామన్నారు. ప్రతి ఇంటికీ నీరు అందుబాటులోకి రావడం చాలా ముఖ్యం అన్నారు. అందుకే పంప్ హౌస్ లలో టెక్నికల్ సమస్యలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కొంతమంది వ్యక్తులు అక్రమంగా పంప్ హౌస్ నుండి వాటర్ ట్యాంకుల్లోకి నీటిని వదిలే చర్యలకు పాల్పడుతున్నారని తెలిసిందని, అటువంటి చర్యలను ప్రభుత్వం సహించదని స్పష్టం చేశారు. అధికారులు పంప్ హౌస్ లోని మోటార్ల పనితీరు, నీటి స్థాయిలు, సరఫరా

డిఇ రామమూర్తి, ఎఇ జనార్ధన్‌తో మాట్లాడుతున్న మహ్మద్‌గౌస్

గమనికలు వంటి విషయాలను వివరించగా, వాటిపై చైర్మన్ సమీక్ష చేసి తగిన మార్గదర్శకాలను వివరించారు. మునిసిపాలిటీకి అందిన ఫిర్యాదులపై కూడా స్పందించి, తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు.

పాలకుల నిర్లక్ష్యంతోనే తాగునీటి సమస్య

రెండవ రోజు కొనసాగిన పాదయాత్ర

ప్రజాశక్తి - ఆదోని రూరల్

గ్రామాలలో తాగునీటి సమస్యలకు పాలకుల నిర్లక్ష్యమే ముమ్మాటికి కారణమని సిపిఎం మండల కార్యదర్శి కె.లింగన్న, కార్యదర్శి వర్గ సభ్యులు వీరారెడ్డి, ఉచ్చిరప్ప విమర్శించారు. తాగునీటి సమస్యను పరిష్కరించాలని రెండోరోజు పాదయాత్ర కొత్తూరు, మాంత్రికి, సుల్తాన్‌పురం, పెసలబండ, కపట్టి, నాగలాపురం, బైచిగేరి, ఆరెకల్ వరకు పాదయాత్ర సాగింది.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆదోని మండలం కుప్పగల్లు ఎస్ఎస్ ట్యాంక్, నెమలికల్ స్కీం ద్వారా గ్రామాలకు రోజు మార్చి రోజు తాగునీరు సరఫరా చేయాలని కోరారు. ప్రభుత్వాలు ఇంటింటికి తాగునీరు అందిస్తామని మాటలు చెప్పడం తప్ప తాగునీరు అందించడంలో పూర్తిగా విఫలమవుతున్నారని, నెమలికల్ స్కీం నుండి 16 గ్రామాలకు నీళ్ల సరఫరా కావలసి ఉండగా కాలం చెల్లిన పైప్‌లైన్ ద్వారా తాగునీటిని అందించడం ఎంతవరకు సాధ్యమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. వేసవిలో తాగునీటి అవసరం ఎక్కువ ఉన్న సందర్భంలో నీళ్ల తగ్గించి సరఫరా చేయడం సరైనది కాదని వారన్నారు.ప్రజల ఓట్లతో గెలిచిన ఎంపీలు ఎమ్మెల్యేలు ప్రజలకు అవసరమైన త్రాగునీరు అందించడానికి

మాట్లాడుతున్న సిపిఎం ఆదోని మండల కార్యదర్శి లింగన్న

ఎలాంటి కృషి చేశారో చెప్పాలని వారు ప్రశ్నించారు. గెలిచి ఇంట్లో కూర్చోవడం కాదని, ప్రజల తాగునీరు గురించి పట్టించుకోవడం ముఖ్యమని వారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తక్షణమే యుద్ధ ప్రాతిపదికన తాగునీటి సమస్యను పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు శ్రీనివాసులు, గోవిందు, హనీఫ్‌బాషా, ఈరన్న, దస్తగిరిబాష, భీమాంజనేయులు, హనుమంత్ రెడ్డి, మల్లికార్జున పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సేవా సమితి యజమాన్యాన్ని అరెస్టు చేయాలి

- మృతుల కుటుంబాలకు న్యాయం జరిగే వరకూ పోరాటం
- ఎంఆర్‌పిఎస్ నాయకులు

ప్రజాశక్తి - కౌతాళం

ఇద్దరు దళిత యువకుల మృతికి కారణమైన ఆర్యవైశ్య సేవా సమితి యజమానులను అరెస్ట్ చేయాలని ఎంఆర్‌పిఎస్ జిల్లా నాయకులు దుర్గప్ప ,నాగరాజు మండల అధ్యక్షులు ఆనంద్ డిమాండ్ చేశారు. విద్యుత్ ఘాతంతో మృతి చెందిన దళిత కుటుంబాలకు న్యాయం జరిగేంత వరకు పోరాటం చేస్తాం తెలిపారు. సోమవారం ఉరుకుందలోని ఆర్యవైశ్య సేవా సమితి దగ్గర ఆందోళన చేపట్టారు. కౌతాళం మండలం ఉరుకుంద గ్రామంలో ఐదు రోజుల క్రితం ఆర్యవైశ్య సేవా సమితి కళ్యాణ మండపంలో పనిచేస్తూ విద్యుత్ ప్రమాదంలో సునీల్ కుమార్, మహేంద్ర మృతి చెందరన్నారు. విద్యుత్ వైర్లు కిందకి వేలాడుతున్న నిర్లక్ష్యంగా ఉంటూ ప్రమాదానికి కారణమైన ఆర్యవైశ్య సేవా సమితి కళ్యాణ మండపం యజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, మృతుల కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. ఆందోళన చేస్తున్న సమాచారం తెలుసుకున్న

ఉరుకుంద ఆర్యవైశ్య సేవాసమితి దగ్గర ఆందోళనకు చేస్తున్న బాధితులు

కౌతాళం సీఐ అశోక్ కుమార్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ఆందోళన విరమించేందుకు ప్రయత్నాలు చేశారు. బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేంత వరకు ఆందోళన విరమించేది లేదని ఎమ్మార్పీఎస్ నాయకులు అక్కడే బైటాయించారు. సిఐ అశోక్ కుమార్ మాట్లాడుతూ ఈ కేసు విషయంలో పూర్తిస్థాయి విచారణ జరిపి బాధ్యులు పైన చట్టపరమైన చర్యలు తీసుకుని మృతుల కుటుంబాలకు న్యాయం జరిగే విధంగా చూస్తామని సిఐ హామీ ఇవ్వడంతో ఆందోళనను విరమించుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు రాజబాబు, సురేంద్ర, రవి, ఏరిగేరి వీరేష్, ప్రకాష్, నరసింహులు, తెలుగు జయప్ప పాల్గొన్నారు.

బేస్ బాల్ వేసవి శిక్షణ శిబిరం

ప్రజాశక్తి - గోనెగండ్ల

స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ ఆధ్వర్యంలో బేస్ బాల్ సమ్మర్ కోచింగ్ క్యాంప్-25 శిక్షణ శిబిరాన్ని గోనెగండ్లలోని జిల్లా పరిషత్ హైస్కూల్ మైదానంలో ఎంఇఒలు రామాంజనేయులు, నీలకంఠలు సోమవారం ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ వేసవిలో సమయం వృథా చేయకుండా విద్యార్థిని, విద్యార్థులు ఇలాంటి శిక్షణ శిబిరాల్లో పాల్గొని క్రీడల్లో రాణించాలన్నారు. శిబిరానికి సీనియర్ కోచ్‌గా వ్యవహరిస్తున్న రాజేశ్వరిలా ప్రతి

ఒక్కరూ జిల్లా, రాష్ట్ర స్థాయి జాతీయ స్థాయిలో రాణించి చదువుతోపాటు క్రీడల్లో రాణించి జీవితంలో ఉన్నత స్థానాన్ని పొందాలన్నారు.

జూనియర్ లైన్‌మెన్ సస్పెన్షన్ రద్దు చేయాలి

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి అంజిబాబు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

మంత్రాలయం తాలూకా పెద్దకడబూరు మండలం పరిధిలోని నౌనేకల్ గ్రామ జూనియర్ లైన్మెన్ గ్రేడ్ 2 ఎం అంజినయ్య సస్పెన్షన్ వెంటనే రద్దు చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి అంజిబాబు, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగరాజు, సిఐటియు తాలూకా అధ్యక్ష కార్యదర్శులు గోవిందు, రాముడు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని విద్యుత్ శాఖ డివిజన్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఎమ్మిగనూరు డివిజన్ లోని మంత్రాలయం సబ్ డివిజన్ పరిధిలోని పెద్ద కడుబూరు మండలం నౌనేకల్ సబ్ స్టేషన్ పరిధిలో ఈ నెల 3న భారీ ఈదురుగాలులు, వర్షం కారణంగా ముచ్చు గేరి 11 కెవి ఫీడర్, వాటర్ వర్క్ ఫీడర్ రాత్రి బ్రేక్ డౌన్ అయిందని, జూనియర్ లైన్మెన్ అంజినయ్య వర్షం తగ్గిన వెంటనే ఐదు గంటలకు బ్రేక్ డౌన్ రెటిఫై చేయడానికి ఫీల్డ్‌కు వెళ్లారని, వాటర్ వర్క్ ఫీడర్11 కె.వి పిన్ ఇన్సులేటర్ పగిలిపోయిందని దానిని మారుస్తున్నానని సరి చేశారని తెలిపారు. ఒక గంట తర్వాత చిన్న తుంబలం వ్యవసాయ పొలంలో విద్యుత్ షాక్‌తో రెండు ఎద్దులు, ఒక పొట్టేలు చనిపోవడం జరిగిందని రైతులు ఫోను ద్వారా తెలపక అక్కడికి వెళ్లి పెద్దకడుబూర్ అసిస్టెంట్ ఇంజనీర్ ఫోన్ ద్వారా తెలిపారని చెప్పారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల జంతువుల ప్రాణ నష్టానికి జూనియర్ లైన్మెన్ అంజినయ్య బాధ్యుని చేస్తూ సస్పెండ్ చేయడం అక్రమ నిర్ణయం అని అన్నారు. మే ఆరో తేదీన మెమో జారీ చేసి ఏడు రోజుల లోపల సమాధానం ఇవ్వాలని

- మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి అంజిబాబు

అంజినయ్యను కోరారని, ఏకంగా మే 9వ తేదీన అంజినయ్య సస్పెండ్ చేస్తూ మెమో జారీ చేయడం ఎంతవరకు సక్రమం అని ప్రశ్నించారు. అలాగే పెద్దకడబూరు అసిస్టెంట్ ఇంజనీర్ రాచమర్ల సుబ్బారెడ్డి సిబ్బంది నానా దుర్భాషలాడుతున్నారని, అలాగే ఆపరేటర్లకు ఒక్కొక్కరికి రెండు మూడు వేల జీతాలు కట్ చేస్తున్నారని ఇలాంటి వ్యక్తి తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. అంజినయ్యను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. డిఇ విజయ రాజుకు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.రమేష్ బాబు, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ డివిజన్ కార్యదర్శి ప్రవీణ్, గ్రేడ్ 2 లైన్మెన్ సంఘం నాయకులు నాగన్న, రసూల్, అనిల్, కర్రెన్న పాల్గొన్నారు.

ఆర్వో ప్లాంట్ల యాజమాన్యంపై చర్యలకు డిమాండ్

- సబ్ కలెక్టర్‌కు సిపిఎం ఫిర్యాదు

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని శివారు మండగిరి పరిధిలో ప్రభుత్వం నుండి ఎటువంటి అనుమతులు తీసుకోకుండా నీటి దోపిడీ చేస్తున్న ఆర్వో వాటర్ ప్లాంట్ల యజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సిపిఎం పట్టణ కార్యదర్శి లక్ష్మన్న, కార్యదర్శి వర్గ సభ్యులు గోపాల్, తిప్పన్న, పట్టణ కమిటీ సభ్యులు వెంకటేష్, నాగరాజు డిమాండ్ చేశారు. సోమవారం గ్రీవెన్స్‌లో ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు వినతి పత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో సుమారు 8 వాటర్ ప్లాంట్లు ఉన్నాయని, వాటికి ఎటువంటి అనుమతులు మంజూరు కాలేదని స్వయాన మండగిరి గ్రామ పంచాయతీ కార్యదర్శి రాతపూర్వకంగా సమాచారం ఇచ్చారన్నారు. పంచాయతీ పరిధిలో అనేక సంవత్సరాల నుండి ఎటువంటి అనుమతులు తీసుకోకుండా నిర్వహిస్తున్న ఆర్వో వాటర్ ప్లాంట్ల యజమాన్యంపై ఎటువంటి చర్యలు తీసుకోకుండా సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా ఉండడం సరైనది కాదని వారు తెలిపారు. ఇప్పటికే మండలంలో అనేక గ్రామాలలో మంచినీటి సమస్యతో ప్రజలు సతమతమవుతున్నారని వారు తెలిపారు. ప్రధానంగా గ్రామాలలో పది రోజుల



సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

నుండి 15 రోజులకు ఒకసారి మంచినీరు సరఫరా కాలేని దౌర్భాగ్య పరిస్థితి ఉందని స్వయానా ఆదోని శాసనసభ్యులు అసెంబ్లీలో మాట్లాడటం జరిగిందని వారు గుర్తు చేశారు.

అయితే పంచాయతీ పరిధిలో మాత్రం యధాఘగా భూగర్భ జలాల నీటిని ఎటువంటి అనుమతులు లేకుండా అమ్మి సొమ్ము చేసుకుంటున్న ఆర్వో వాటర్ ప్లాంట్ యజమాన్యంపై చర్యలు తీసుకోకపోవడం చాలా దురదష్టకరమని వారు తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత వారందరిపై వెంటనే చర్యలు తీసుకోవాలని వారు సబ్ కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.

20న సమ్మెను జయప్రదం చేయండి: సిఐటియు

ప్రజాశక్తి-ఎమ్మిగనూరు

అంగన్వాడి వర్కర్స్ హెల్పర్స్ ఆధ్వర్యంలో ఈనెల 20న కనీస వేతనం రూ 26000 ఇవ్వాలని ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు కార్యదర్శి బి.గోవర్ధనమ్మ, అర్బన్ కార్యదర్శి ఎస్ నాగలక్ష్మి, సిఐటియు మండల అధ్యక్ష కార్యదర్శులు పి.గోవిందు, బి. రాముడు డిమాండ్ చేశారు. సోమవారం దేశవ్యాప్త సమ్మెను ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఒకి సమ్మె నోటీసు ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐసిడిఎస్ లో గర్భవతులకు బాలింతలకు 0 నుంచి 6 సంవత్సరాల వయసు ఉన్న పిల్లలకు పౌష్టికాహారం అందిస్తున్న అంగన్వాడి వర్కర్స్ హెల్పర్స్ కు చాలీచాలని వేతనాలతో జీవనం గడుపుతున్నారని వారికి ఎటువంటి సామాజిక పథకాలు అందడం లేదని రిటైర్మెంట్ బెనిఫిట్స్ గ్రాడ్యుటి అందడం లేదని



ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఒకు సమ్మెనోటీసులు ఇస్తున్న నాయకులు

ఆవేదన వ్యక్తపరిచారు. ఏళ్ల తరబడి సర్వీస్ ఉన్నవాళ్లు నేటికీ కనీస వేతనం అందరం లేదని తెలిపారు. కార్మిక చట్టాలు కనీస వేతన చట్టం సామాజిక భద్రత చట్టం ఉన్నప్పటికీ భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కూటమి ప్రభుత్వం సిఎం చంద్రబాబు నాయుడు అంగన్వాడీల పట్ల నిర్లక్ష్య ధోరణి వ్యవహరిస్తున్నారని తెలిపారు. మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గొప్ప గొప్ప ప్రకటన చేస్తూ శ్రామిక మహిళలను మోసం చేస్తున్నారని ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని తెలిపారు. ఈనెల20న దేశవ్యాప్తంగా చేస్తున్న సమ్మెను జయప్రదం చేయాలని అంగన్వాడి వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ పిలుపునిచ్చింది. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు యుఎం.నాగలక్ష్మి, మున్ని, కె.శైలజ, పార్వతి, జయమ్మ పాల్గొన్నారు.

వడదెబ్బతో వాటర్ మెన్ మృతి

ప్రజాశక్తి - ఆలూరు

కర్నూలు జిల్లా ఆలూరు మండల విరుపాపురం స్కీమ్ కింద ఉన్న గ్రామాలకు తాగునీటిని సరఫరా (వాటర్ మెన్)లో పని చేస్తున్న ఈరన్న సోమవారం వడదెబ్బతో మృతి చెందారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు... ఉదయం అరికేర తండాకు వెళ్లి 11 గంటల తరువాత ఇంటికి వచ్చాక తీవ్ర అస్వస్థతకు గురైతే ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మతుడికి భార్య ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. వాటర్‌మెన్ కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

కెడిసిసిబి చైర్మన్‌గా ఎంపికయిన విష్ణువర్ధన్‌రెడ్డికి పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న సీనియర్‌గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్‌శర్మ

రాష్ట్ర స్థాయిలో విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి-సి బెళగల్

2025-2026 విద్యా సంవత్సరంలో ఐదవ తరగతిలో గురుకుల ప్రవేశానికి గాను భార్గవ్ రాయల్ స్కూల్ విద్యార్థి యూ ప్రజ్వల్ అశ్విత్ ప్రతిభను చాటుకున్నారు. కరస్పాండెంట్ ఎ.వెంకటస్వామి ఆదివారం ఉపాధ్యాయుల మధ్య తల్లిదండ్రులు కౌతాళం కామవరం లక్ష్మిదేవి, జనార్ధన ల సమక్షంలో ఆ విద్యార్థికి అభినందనలు తెలిపారు. 50 మార్కుల పరీక్ష కు గాను 47 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో 31, జిల్లా స్థాయిలో 4, మండల స్థాయిలో టాపర్‌గా నిలిచారని గర్వించదగ్గ విషయమని ఈ సందర్భంగా కరస్పాండెంట్, ఉపాధ్యాయులు పేర్కొన్నారు.

మద్దికేరలో గుండె , కంటి ఉచిత పరీక్షలు

ఎంపిపి అనిత యాదవ్

ప్రజాశక్తి-మద్దికేర : ఈనెల 13న మంగళవారం ఉదయం గుండె , కంటి పరీక్షలను ఉచితంగా చేస్తున్నామని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపిపి అనితా యాదవ్ తెలిపారు. నిష్ణాతులైన డాక్టర్లతో అధునాతనమైన పరికరాలతో గౌరీ గోపాల్ హాస్పిటల్ కర్నూలు వారి సౌజన్యంతో గుండె, కంటి ఉచిత పరీక్ష శిబిరం మండల పరిషత్ ఆఫీసు దగ్గర సచివాలయంలో ఎంపిపి డిఎస్ అనిత యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆమె మాట్లాడుతూ అతిగా ధూమపానం, మద్యపానం, బీపీ షుగర్, అధిక కొలస్ట్రాలు నడిస్తే ఆయాసం, ఛాతిలో నొప్పి గుండె దడ వంటి, లక్షణాలు గలవారికి ఉచితంగా ఇసిజి, బిపిపరీక్ష , కంటిశుక్లం ఉన్నవారికి కంటి ఆపరేషన్లు, కంటి జబ్బులకు కూడా ఉచితంగా చికిత్స చేస్తారన్నారు. మద్దికేర మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మంగళవారం ఉదయం ఎనిమిది గంటలకు మండల పరిషత్తు దగ్గర ఒకటో సచివాలయానికి రావాలని కోరారు. చికిత్స చేయించుకున్న ప్రతి ఒక్కరికి మధ్యాహ్న భోజనం సౌకర్యం కూడా కల్పిస్తామని చెప్పారు.

చదువుతోపాటు పిల్లలకు దేశభక్తిని నేర్పాలి

-జై జవాన్ కార్యక్రమంలో మహిళా వక్తలు

ప్రజాశక్తి - కర్నూల్ కల్చరల్

జై జవాన్ కల్చరల్ ఫెస్ట్‌లో భాగంగా మూడో రోజు సోమవారం సాయంత్రం నవ్యాంధ్ర రచయితల సంఘం ఆధ్వర్యంలో జై జవాన్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ పార్వతి అధ్యక్షత వహించిన ఈ సభలో మహిళలు మాట్లాడుతూ దేశభక్తి అంటే ఆగస్టు 15, జనవరి 26 కాదని, ప్రజల్లో నిరంతరం ఉండాలన్నారు. దేశభక్తి అనేది సైనికులకు మాత్రమే కాదని దేశంలో ప్రజలందరి వద్ద ఉండాలన్నారు. జాతి చైతన్యవంతం బలోపేతం చేయాలంటే మహిళల పాత్ర ఎంతో ఉందన్నారు. ఇటీవల విన్ కమాండర్లు వ్యూమిక సింగ్ సోఫియా కురేసి నిర్వహించిన పాత్ర మహిళల శక్తిని చాటుతుందన్నారు. జై జవాన్ అంటే తండ్రి వంటి వాడని జై కిసాన్ అంటే తల్లి వంటిదని వీరిద్దతో మనకు ఎంతో అవసరం ఉందన్నారు. సాహిత్యంలో రచనలు కేవలం స్వార్ధంగా కాకుండా దేశక్షేమం కోసం రాయాలన్నారు. దేశం నాది, ధర్మం నాది అని ఆలోచన ప్రజల్లో రావాలన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ మాజీ అధ్యక్షురాలు నగరూరు శమంతకమని,

- భారత్‌మాత చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న మహిళలు

రిటైర్డ్ డైట్ లెక్చరర్ విజయలక్ష్మి, దీపక్ తేజ ఆసుపత్రి అధినేత జయలక్ష్మి, సైకాలజిస్ట్ జ్యోతిర్మయి, కవయిత్రి కళ్యాణదుర్గం స్వర్ణలత, 90 ఏళ్ల వృద్ధురాలు, కవి ఆరేపల్లి వరలక్ష్మి, కవులు సునీత, డాక్టర్ చంద్రమౌళిని మాట్లాడారు. అంతకుముందు గాయని సుజాత అనేక దేశభక్తి గీతాలు ఆలపించారు. కరీముల్లా శిష్య బృందం నృత్య ప్రదర్శన చేశారు. అనంతరం మహిళలు కోలాటం ప్రదర్శించారు. ఎఎస్ఐ మహిళ నృత్య ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమం బుద్ధ పూర్ణిమ అన్నమాచార్య జయంతులను స్మరించుకుంది. కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య స్వాగతం పలుకుతూ మూడో రోజు కేవలం మహిళలతో కార్యక్రమాలను ఏర్పాటు చేశామన్నారు.

నేడు జానపద శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు

మంగళవారం కర్నూలు నాట్యాచార్యులు నాగసాయి, ప్రదీప్, కరిముల్లా, మల్లేశ్వరి, రోహిత్, నారాయణస్వామి, శిష్య బృందం, నాట్య ప్రదర్శనలు దేశభక్తి పైన ఉంటాయని అధ్యక్షులు పత్తి ఓబులయ్య తెలిపారు.

పెండింగ్ ఆధార్ అప్‌డేట్ త్వరగా పూర్తి చేయండి

- ఎంపిడిఒ అల్లా బకాష్

ప్రజాశక్తి - చిప్పగిరి: పెండింగ్లో ఉన్న ఆధార్ కార్డుల అప్‌డేట్ త్వరగా పూర్తి చేసేందుకు కృషి చేయాలని ఎంపీడీవో అల్లా బకాష్ అంగన్వాడి సిబ్బందికి సూచించారు. సోమవారం మండల కార్యాలయంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ ప్రసూన ఆధ్వర్యంలో అంగన్వాడీ టీచర్లకు ఆధార్ కార్డు అప్డేట్‌పై సమావేశం నిర్వహించారు. ఎంపిడిఓ మాట్లాడుతూ ఉన్నతాధికారులు ఆధార్ పూర్తి చేయాలని చాలా సీరియస్ గా ఉన్నారని, మీరందరూ కూడా సకాలంలో పూర్తి చేసుకోవాలన్నారు. రాబోయే రోజులలో లబ్ధిదారులకు ఏదైనా అంగన్వాడీ కేంద్రాల ద్వారా లబ్ధి చేకూరాలంటే తప్పనిసరిగా ఆధార్ కార్డులు ఉంటేనే ఆ పథకాలకు అర్హులవుతారన్నారు. మహిళా సంరక్షకురాలు పావని పాల్గొన్నారు.

కిషోర్ వికాసంపై అవగాహన సదస్సు

యుక్త వయస్సు రాకముందే బాలికలకు వివాహాలు చేయడం వల్ల అనారోగ్యం పాలవుతారని, అంతేగాక ఒక్కోసారి ప్రాణాలు పోయే పరిస్థితి ఏర్పడుతుందని ఐసిడిఎస్ సూపర్వైజర్ ప్రసూన అన్నారు. మండల కార్యాలయంలో సోమవారం కిశోర వికాసంపై అంగన్వాడి సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. అవగాహన సదస్సుకు ముఖ్యఅతిథిగా ఎంపీడీవో అల్లా బకాష్ పాల్గొన్నారు.

శ్రీ మఠంలో పీఠాధిపతులకు సిబ్బంది తులాభారం

ప్రజాశక్తి-మంత్రాలయం : ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమెన మంత్రాలయంలోని శ్రీ రాఘవేంద్రస్వామి మఠంలో పీఠాధిపతులు శ్రీ సుభుదేంద్రతీర్థులకు శ్రీ మఠం సిబ్బంది రూపాయి నాణేలతో తులాభారంతో పాటు ఘనంగా సన్మానించారు. సోమవారం పీఠాధిపతుల (ఆశ్రమ స్వీకరణ) పట్టాభిషేక మహోత్సవం 13 ఏళ్లలోకి అడుగు పెట్టిన నేపథ్యంలో స్థానిక శ్రీ మఠం ఆవరణంలోని యాగశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శ్రీ మఠం సిబ్బంది తులాభారం నిర్వహించారు. అనంతరం పీఠాధిపతులకు సిబ్బందితో పాటు గ్రామస్తులు శాలువలతో పూలమాలలు వేసి సన్మానించారు. ఈ సందర్భంగా పీఠాధిపతులు వారికి శేష వస్త్రాలతో ఫల మంత్రాక్షతలు అందజేసి ఆశీర్వదించారు.

శ్రీ సుభుదేంద్రతీర్థులకు తులాభారం చేస్తున్న దృశ్యం

ఘనంగా పీఠాధిపతుల పట్టాభిషేకం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలోని శ్రీరాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతుల పట్టాభిషేక మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వేదాంత సామ్రాజ్యానికి పట్టాభిషక్తుడై 13వ ఏడాదిలోకి అడుగు పెట్టిన నేపథ్యంలో పీఠాధిపతులు శ్రీ సుభుదేంద్రతీర్థుల ఆధ్వర్యంలో విశేష పూజలు, హోమాలు చేపట్టారు. రాఘవేంద్రస్వామి ఆరాధ్య దైవమైన మూల రాములకు, నరసింహ స్వామి విగ్రహాలకు నైవేద్య సమర్పణలో మంగళ హారతులు నిర్వహించినట్లు పీఠాధిపతులు శ్రీ సుభుదేంద్రతీర్థులు ప్రకటించారు. కార్యక్రమంలో ప్రఖ్యాత కన్నడ నటుడు, ప్రజాకీయా పార్టీ అధ్యక్షులు ఉపేంద్ర తన సతీమణి తార, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా నాయకులు కెపి నారాయణ స్వామి

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - ఆలూరు : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలకు, కార్మిక హక్కుల పరిరక్షణకు దేశ వ్యాప్తంగా కార్మిక సంఘాల పిలుపుమేరకు ఈనెల 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు, ఎఐటియుసి, ఐఎన్‌యుసి కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. సోమవారం ఆలూరు జ్యోతిబసు భవన్‌లో ఎఐటియుసి తాలూకా కార్యదర్శి రంగన్న అధ్యక్షతన జరిగిన సమావేశంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కె పి. నారాయణస్వామి మాట్లాడుతూ ప్రాణ త్యాగాలతో సాధించుకున్న 44 చట్టాలను 4 లేబర్ కోడ్‌లుగా కుదించి కార్మిక హక్కులను కాలరాస్తున్న కేంద్ర బిజెపి ప్రభుత్వ మెడలు వంచి కార్మిక హక్కులను కాపాడుకోవాలన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వా లని, ప్రభుత్వ రంగ పరిశ్రమలు ప్రైవేటీకరణ ఆపాలని, కాంట్రాక్ట్, ఔట్ సో ర్సింగ్ రద్దు చేయాలన్న డిమాండ్ల కోసం కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మే రకు కేంద్ర రాష్ట్ర ప్రభు త్వాలకు వ్యతిరేకంగా సమ్మెకు పిలుపునిచ్చా య న్నారు.19న బైక్ ర్యాలీ, 20న సమ్మెలో పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చే యాలని కోరారు. వ్యకాసం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ భూపేష్, షాకీర్, పూ ల రామాంజి నేయులు, రామాంజనేయులు, లక్ష్మీకాంత్ రెడ్డి, చాపలగో పాల్, మాబు, ఘని, విఠల్, నాగరాజు, వీరేష్, గోవింద్, తిమ్మప్ప, ఈరన్న పాల్గొన్నారు.

పుస్తక పఠనం మంచి లక్షణం

ప్రజాశక్తి - కౌతాళం : విద్యార్థులకు పుస్తకాలు చదవడం ఒక మంచి లక్షణమని కౌతాళం గ్రంథాలయ అధికారిని మధులీల పేర్కొన్నారు. సోమవారం స్థానిక గ్రంథాలయంలో సమ్మర్ ఓరియెంటెడ్ కార్యక్రమంలో భాగంగా పుస్తక పఠనం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు పుస్తక పఠనం అనేది ఉన్నత చదువులకు దోహదపడుతుందన్నారు. విద్యార్థి దశ నుండి వివిధ రకాల కథల పుస్తకాలు చదువుతూ ఉంటే ఎన్నో విషయాలు అర్థమవుతుందన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు పిల్లల చదువులపై శ్రద్ధ వహించాలన్నారు.

ఇసుక అక్రమ రవాణాకు బ్రేక్

- ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - హాలహర్వి : యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా అనే శీర్షికన ప్రజాశక్తిలో వచ్చిన వార్తకు డివిజన్ అధికారులు స్పందించారు. అక్రమ నివారణకు చర్యలు తీసుకోవాలని తహశీల్దార్ నజ్మాభాను కు ఆదేశాలు ఇచ్చారు. వేదవతి నది పరివాహక గ్రామాలైన జేహోసల్లి, బల్లూరు సిద్దాపురం అమతాపురం, గూళ్యం గ్రామాలలో ఇసుక అక్రమ రవాణా జరుగుతుందని విషయం ప్రజాశక్తి వెలుగులోకి తెచ్చింది. ఈ గ్రామాలలో ఇసుక అక్రమ రవాణా జరగకుండా చేసేందుకు విఆర్‌ఒలను తలారిలను నియమించిందని తహశీల్దార్ తెలిపారు. గ్రామాలలో ఎవరైనా ఇసుక అక్రమ రవాణా జరిపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.